సాక్షి యాదాద్రి భువనగిరి

ఆదివారం ׀ 15 ׀ అక్టోబర్ ׀ 2023



అసమానతలు దూరం

అసమానతలను రూపుమాపేందుకు బుద్ధుని బోధనలే శరణ్యమని నాగార్జున ఇనిస్టిట్యూట్ అధ్యక్షుడు అన్నారు. - 10లో



అర్చకుడిపై చర్యలు తీసుకోవాలి

రోడ్డును ధ్వంసం చేసిన యాదాద్రి ప్రధాన అర్చకుడు, ఆయన కుమారులపై చర్యలు తీసుకోవాలని రాస్తారోకో చేశారు. - 11లో

వీర వనితల అడ్డా..

భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి బతుకుల విముక్తి కోసం సాగిన పోరులో నల్లగొండ జిల్లా వీర వనితలు తెగువచూపారు. - 10లో



● ఒక్కేసి.. పువ్వేసి..





ఎంగిలిపువ్వు సందర్భంగా శనివారం భువనగిరిలో బతుకమ్మను ఎత్తుకొని వస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సతీమణి వనిత, హౌసింగ్‌బోర్డు కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

న్యూస్‌రీల్

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నుంచి 24వ తేదీ వరకు శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను దేవస్థానం అధికారులు పూర్తి చేశారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకల్లో పాల్గొనే దంపతులు రూ.1,116 టిక్కెట్ కొనుగోలు చేయాలని ఈఓ గీతారెడ్డి తెలిపారు. ఒక్క రోజు సప్తశతి పారాయణంలో పాల్గొనడానికి రూ.116, లక్ష కుంకుమార్చనకు రూ.116 చెల్లించాలన్నారు. ఉత్సవాలు ముగిసే వరకు శ్రీరుద్ర హోమం రద్దు చేసినట్లు అర్చకులు తెలిపారు.

పప్పు విక్రయ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రామకృష్ణారెడ్డి

మోత్కూరు : పట్టణంలోని నాగార్జున రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగపప్పు విక్రయ కేంద్రాన్ని శనివారం రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి ప్రారంభించారు.కిలో రూ.60కి విక్రయించనున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ అశోక్‌రెడ్డి, సంఘం సీఈఓ వరలక్ష్మి, రైతుబంధు మండల అధ్యక్షుడు సోంమల్లు, మార్కెట్ మాజీ చైర్మన్లు మేఘారెడ్డి, యాకూబ్‌రెడ్డి, డైరెక్టర్లు పద్మారెడ్డి, ముత్యాలు, లక్ష్మయ్య, మల్లయ్య, రమేష్, మధు, తిరుమలేష్ పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో శనివారం నిత్యారాధనలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత, అభిషేకం, అర్చన చేశారు. అనంతరం ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం జోడు సేవలను ఆలయ మాడవీధిలో ఊరేగించారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



గోపూజలో పాల్గొన్న సాయిధామం పీఠాధిపతి

బొమ్మలరామారం :ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని సాయిధామం ఆశ్రమ పీఠాధిపతి రామానంద ప్రభూజీ అన్నారు. బొమ్మలరామారం మండలంలోని పెద్ద పర్వతాపూర్‌లో గల సాయిధామం సేవాశ్రమం గోశాలలో శనివారం గోపూజ నిర్వహించారు. సకల దేవతల నిలయమైన గోవును పూజిస్తే శుభాలు కలుగుతాయన్నారు. లోక కళ్యాణం కోసం గో సంపదలను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ సభ్యులు చంద్రారెడ్డి, ఎలబోయిన శ్రీహరి, మంజుల, బొమ్మకంటి, మల్లేష్ బండి మహేష్ గౌడ్,జ్యోతి, భక్తులు పాల్గొన్నారు.

ఆశీర్వాద సభ.. రేపే

ఉమ్మడి జిల్లాలో కేసీఆర్ తొలి ప్రచార సభ

- సిద్ధమవుతున్న భువనగిరి
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి
- భారీ జన సమీకరణకు సన్నాహాలు



భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సిద్ధమవుతున్న సభా వేదిక



సభా ఏర్పాట్లను పరిశీలించి నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి : ఉమ్మడి జిల్లాలో జరిగే బీఆర్‌ఎస్ తొలి ఎన్నికల ప్రచార సభలో పాల్గొనడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈనెల 16న భువనగిరికి రానున్నారు. ప్రజా ఆశీర్వాద సభ పేరుతో 2023 ఎన్నికల ప్రచారాన్ని భువనగిరి నుంచి ప్రారంభించనున్నారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి బహిరంగ సభలకు వేదికైన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోనే ప్రజా ఆశీర్వాద సభ కూడా జరగనుంది. కేసీఆర్ సెంటిమెంట్‌గా భావించే ఈ మైదానంలో 50 వేల మందితో ఆశీర్వాద సభ నిర్వహించనున్నారు. ఈ సభకు స్థానిక ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. సీఎం కేసీఆర్ 16వ తేదీ ఉదయం జనగామలో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొంటారు. అక్కడి నుంచి మధ్యాహ్నం భువనగిరికి చేరుకుంటారు. ఇక్కడ జరిగే బహిరంగ సభలో ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించే అవకాశం ఉంది. సీఎం ప్రకటించే వరాల కోసం అన్ని వర్గాల ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

మూడోసారి ఇక్కడే ఎన్నికల బహిరంగ సభ

భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం తమకు అచ్చొచ్చిన వేదికగా బీఆర్‌ఎస్ భావిస్తోంది. 2014, 2018లోనూ ఈ మైదానంలోనే సీఎం ఎన్నికల బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు తెలంగాణ ఉద్యమ కాలంలో ఈ మైదానం వేదికగా జరిగిన పలు సభల్లో కేసీఆర్ పాల్గొన్నారు. సెంటిమెంట్‌గా ప్రస్తుత ఎన్నికల్లోనూ ఇక్కడ జరిగే బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించనున్నారు. కాగా సభా ఏర్పాట్లను ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్నారు.

100 మందికి ఒక ఇన్‌చార్జ్

ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయడానికి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి ఇప్పటికే మున్సిపాలిటీలు, మండలాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించారు. నాయకులకు దిశానిర్దేశం చేశారు. భువనగిరి నియోజకవర్గంలోని అన్ని బూత్‌ల నుంచి జనం సభకు వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 100 మందికి ఒకరు చొప్పున ఇంచార్జ్‌లను నియమించి జనాన్ని తరలించే బాధ్యతలను అప్పగించారు. సీఎం పాల్గొంటున్న తొలి ఎన్నికల ప్రచార సభ కావడంతో ఎక్కడా లోటుపాట్లు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

స్పిన్నింగ్ మిల్లులో హెలిపాడ్

ముఖ్యమంత్రి కేసీఆర్ రాక నేపథ్యంలో భువనగిరిలోని స్పిన్నింగ్ మిల్లులో హెలిపాడ్ ఏర్పాటు చేశారు. హెలిపాడ్ నుంచి కారులో ప్రజా ఆశీర్వాద సభ జరిగే జూనియర్ కళాశాల మైదానానికి సీఎం చేరుకుంటారు.

మళ్లీ అధికారంలోకి రాబోతున్నాం - ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో విశేష ప్రగతి సాధించిందని, మూడోసారి కూడా అధికారంలోకి రాబోతున్నామని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన సభా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. భువనగిరి సభలో ఎన్నికల మేనిఫెస్టోను సీఎం కేసీఆర్ ప్రకటిస్తారని వెల్లడించారు. సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా మేనిఫెస్టో ఉండబోతుందన్నారు. సీఎం కేసీఆర్ సాగు, తాగునీటికి అధిక ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొన్నారు. రైతుబంధు, రైతుబీమా, వ్యవసాయానికి ఉచిత కరెంట్, గొర్రెల పంపిణీ, చెరువుల్లో చేపల పంపిణీ, ఆసరా పింఛన్లు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారని పేర్కొన్నారు. అంతేకాకుండా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశారని తెలిపారు. భువనగిరిలో సీఎం కేసీఆర్ పాల్గొనే ప్రజా ఆశీర్వాద సభకు పెద్ద ఎత్తున జనం రానున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో తొలి ఎన్నికల ప్రచార సభ కావడంతో ఎలాంటి లోటు పాట్లు రాకుండా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

నేడు కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా

- మొదటి విడతలో సీనియర్ల పేర్లు!
- వామపక్షాలకు స్థానాల కేటాయింపుపైనా స్పష్టత వచ్చే అవకాశం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీలో ఉండే అభ్యర్థుల జాబితా ఆదివారం వెల్లడి కానుంది. తొలి జాబితాలో రాష్ట్ర వ్యాప్తంగా 58 స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తామని పార్టీ స్క్రీనింగ్ కమిటీ అధ్యక్షుడు మురళీధరన్ పేర్కొన్నారు. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుంచి ఆశావహులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. పార్టీ దరఖాస్తులను స్వీకరించిన సమయంలో ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల నుంచి టికెట్ కావాలని 130 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారం దరూ టికెట్ కోసం ఢిల్లీ స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఆదివారం ప్రకటించబోయే మొదటి జాబితాలో ఎంత మంది పేర్లు ఉంటాయన్నది తేలిపోనుంది. ముఖ్యంగా మొదటి జాబితాలో.. సీనియర్ల పేర్లు, ఎక్కువ పోటీ లేదనుకునే స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. ఇందులో నల్లగొండ నుంచి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, హుజూర్‌నగర్ నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ నుంచి పద్మావతిరెడ్డి, ఆలేరు నుంచి బీర్ల అయిలయ్య, నకిరేకల్ నుంచి వేముల వీరేశం, నాగార్జునసాగర్ నుంచి కుందూరు జయవీర్‌రెడ్డి పేర్లు ఉండే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. వీటితోపాటు దేవరకొండ వంటి మరికొన్ని నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉందని చెబుతున్నారు.

కమ్యూనిస్టులకు ఇచ్చే స్థానాలపైనా..

కాంగ్రెస్‌తో కమ్యూనిస్టు పార్టీల పొత్తు ఖరారైంది. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ కూడా స్పష్టం చేశారు. అయితే, కమ్యూనిస్టు పార్టీలు రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు స్థానాలు కావాలని పట్టు పడుతున్నట్లు తెలిసింది. అందులో సీపీఐకి మునుగోడు, సీపీఎంకు మిర్యాలగూడ, అలాగే ఖమ్మం జిల్లాలోనూ రెండు స్థానాలు కావాలని అడుగుతున్నాయి. నల్లగొండ జిల్లాలో సీపీఐకి మునుగోడును కేటాయించే అవకాశాలు ఉన్నాయని ఆ పార్టీల వర్గాలు పేర్కొన్నాయి. ఆ వాదనను కాంగ్రెస్ పార్టీ వర్గాలు కొట్టి పారేస్తున్నా ఆదివారం స్పష్టత రానుంది. మరోవైపు సీపీఎంకు మిర్యాలగూడ కేటాయిస్తారా? అన్నది కూడా తేలనుంది.

నిరుద్యోగుల జీవితాలతో ఆటలొద్దు



భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న అఖిలపక్ష నాయకులు

- అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన

భువనగిరిటౌన్ : టీఎస్‌పీఎస్సీలో అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికి ఎన్నికల కోడ్ సాకుతో ప్రభుత్వం పరీక్షలు వాయిదా వేసిందని అఖిలపక్ష నాయకులు ఆరోపించారు. నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వ చెలగాటం ఆడుతుందని దుయ్యబట్టారు. టీఎస్‌పీఎస్సీలో చోటు చేసుకున్న అక్రమాలకు సీఎం కేసీఆర్ బాధ్యత వహిస్తూ బోర్డు చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులను తొలగించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో శనివారం భువనగిరిలోని అమరవీరుల స్మారకస్థూపం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. పరీక్షలు వాయిదా వేయడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది నిరుద్యోగులు కలత చెంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవళికది ఆత్మహత్య కాదని, ప్రభుత్వ హత్యేనన్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే ఇంటికో ఉద్యోగం వస్తుందని నమ్మబలికిన కేసీఆర్.. నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని మండిపడ్డారు.అనంతరం రాస్తారోకో చేసే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వివిధ పార్టీల నాయకులు ప్రమోద్‌కుమార్, జహంగీర్, మహ్మద్‌అతహార్, ఎశాల అశోక్, అవైస్‌చిస్తీ, భట్టు రామచంద్రయ్య, మాయ కృష్ణ, బర్రె నరేష్, ఎడమల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేల వరకే అనుమతి

- అంతకుమించి తీసుకెళ్తే ఆధారాలు తప్పనిసరి
- కలెక్టర్ జెండగె హనుమంత్ కొండిబా



స్ట్రాంగ్‌రూంలు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుపై అదనపు కలెక్టర్, అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్

సాక్షి, యాదాద్రి : అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం రూ.50 వేలకు మించి తీసుకెళ్లరాదని, అంతకుమించి ఉంటే తప్పనిసరిగా ఆధారాలు చూపించాలని కలెక్టర్ జెండగె హనుమంత్ కొండిబా తెలిపారు. శనివారం తన చాంబర్‌లో జిల్లా గ్రీవెన్స్ కమిటీ సభ్యులతో సమావేశం అయ్యారు. తనిఖీల్లో రూ.50 స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువులను పరిశీలించి విడుదల చేసేందుకు గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. నగదు, వస్తువుల సంబంధికుల దరఖాస్తులను గ్రీవెన్స్ కమిటీ పరిశీలిస్తుందన్నారు.ఎక్కువ మొత్తంలో నగదు తెసుకెళ్లవద్దని, అలా పట్టుబడిన నగదును సీజ్ చేసి డిపాజిట్ చేస్తామని చెప్పారు. సరైన ఆధారాలు చూపితే తిరిగి ఇచ్చేస్తారని పేర్కొన్నారు. అత్యవసర వైద్యం, కళాశాల ఫీజులు, వ్యాపారం, పెళ్లిళ్ల ఇతర అవసరాలకు నగదు తీసుకెళ్లే తప్పనిసరిగా ఆధారాలు తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. సీజ్ చేసిన నగదు కోసం అప్పీలు చేసుకోవడానికి గ్రీవెన్స్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసరావు సెల్ నంబర్ 9100115660ను సంప్రదించాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా సహకార అధికారి, గ్రీవెన్స్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసరావు, జిల్లా ట్రెజరీ అధికారి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

'అరోరా'కళాశాలను పరిశీలించిన కలెక్టర్

భువనగిరి టౌన్ : స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం భువనగిరిలోని అరోరా ఇంజనీరింగ్ కాలేజీని కలెక్టర్ పరిశీలించారు. సౌకర్యాలను పరిశీలించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు, ఆర్డీఓ అమరేందర్, తహసీల్దార్ అంజిరెడ్డి ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

భువనగిరి రూరల్ : వరికోతలు ప్రారంభమైనందున వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని పాడి పంట జిల్లా సమాఖ్య అధ్యక్షుడు మొలుగు లక్ష్మయ్య కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం పెద్ద ఎత్తున వస్తుందన్నారు. కేంద్రాలు తెరవకపోవడంతో రైతులు తక్కువ ధరకు ధాన్యం అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు.కేంద్రాలు తెరిచి మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజలకు మరింత చేరువలో తపాలా సేవలు

- తపాలా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న పీకే సంతోష్

భూదాన్‌పోచంపల్లి : తపాలా సేవలు ప్రజలకు మరింత చేరువైనట్లు ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పీకే సంతోష్ అన్నారు. శనివారం భూదాన్‌పోచంపల్లిలో తపాలశాఖ అందజేస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తపాలాశాఖ డిజిటలైజేషన్ అయిన తర్వాత మరిన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్, సుకన్య సమృద్ధి అకౌంట్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, మంత్లీ ఇన్‌కమ్ స్కీం, టైం డిపాజిట్, రికరింగ్ డిపాజిట్, సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీమ్, ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్, తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవితబీమా, పీఎంఎస్‌బీవై, పీఎంజెజెబీవై, అటల్ పెన్షన్ యోజన తదితర పథకాల సేవలను అందజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ సూపరింటెండెంట్ రఘునాథస్వామి, భువనగిరి ఏఎస్‌పీ భూమయ్య, రవి, మదన్, శంకర్‌నాయక్, బీపీఎంలు కుమార్, లక్ష్మణ్, ధన్‌సింగ్, వెంకటయ్య, అశోక్ పాల్గొన్నారు.

అడ్డా మారిన 'బెల్ట్'!

- బెల్టు షాపులను తొలగించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు
- తనిఖీలు ముమ్మరం చేసిన యంత్రాంగం
- రహస్య ప్రాంతాలకు మకాం మార్చిన నిర్వాహకులు
- జోరుగా మద్యం అమ్మకాలు
- అధికారులు కేసులు నమోదు చేస్తున్నా పడని అడ్డుకట్ట



సాక్షి, యాదాద్రి : బెల్టు షాపుల నిర్వాహకులు అడ్డా మార్చారు. ఎన్నికల నేపథ్యంలో యంత్రాంగం తనిఖీలు ముమ్మరం చేయడంతో రహస్య ప్రాంతాలకు మకాం మార్చి మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. ఎక్సైజ్, పోలీసు యంత్రాంగం తనిఖీలు ముమ్మరం చేసినా మద్యం విక్రయాలకు పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేయలేకపోతున్నారు.

నమోదైన కేసులు	58
అరెస్ట్ అయినవారు	37
బైండోవర్ కేసులు	111
స్వాధీనం చేసుకున్న కల్లు, సారా, లిక్కర్	4,216 లీటర్లు
పట్టుకున్న మద్యం విలువ :	రూ.7,4875

వెయ్యికి పైనే బెల్టు షాపులు

జిల్లా కేంద్రంతో పాటు, మున్సిపాలిటీలు, గ్రామాల్లో వెయ్యికి పైగా బెల్టు దుకాణాలు ఉన్నాయి. అయితే ఎన్నికల్లో మద్యం ప్రవాహాన్ని అడ్డుకోవడానికి బెల్టు షాపులను పూర్తిగా తొలగించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఈ మేరకు బెల్టు షాపులను మూసివేయాలని నిర్వాహకులను ఎక్సైజ్, సివిల్ పోలీసులు ఆదేశించారు. సాధారణంగా ఎన్నికల సమయంలో మద్యం అమ్మకాలు రెట్టింపు స్థాయిలో ఉంటాయి. కాబట్టి వ్యాపారాన్ని వదులుకోలేక బెల్టు షాపుల నిర్వాహకులు ప్రస్తుతం ఉన్న అడ్డాలను కొత్త ప్రాంతాలకు మార్చి మద్యం విక్రయిస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లో ఇంకా బెల్టు షాపులు నడుస్తున్నాయి.

తనిఖీలు నిర్వహిస్తున్నాం

"ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అక్రమ మద్యం, డ్రగ్స్ రవాణాను అడ్డుకునేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. తనిఖీలను ముమ్మరం చేశాం. ఎక్సైజ్ శాఖతోపాటు పోలీస్, ఇతర విభాగాల అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారు. బెల్టు దుకాణాలను బంద్ చేయిస్తున్నాం. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు, బైండోవర్ చేస్తున్నాం. 7 వ తేదీ నుంచి 58 కేసులు నమోదు చేశాం. 111 మందిని బైండోవర్ చేశాం. కల్లు, సారా, మద్యం స్వాధీనం చేసుకున్నాం.

–నవీన్‌కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్

ఇతర రాష్ట్రాల నుంచి మద్యం దిగుమతి

బెల్టు దుకాణాలకు ఇప్పటికే ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున మద్యం దిగుమతి అయినట్లు తెలుస్తోంది. మునుగోడు ఉప ఎన్నికల్లోనూ ఒడిశా, గోవా మద్యం ఏరులైపారింది. ప్రధాన రాజకీయ పార్టీలు పోటీపడి మద్యం పంపిణీ చేశాయి. ఓటర్లు, నాయకులు, కార్యకర్తలకు ఎక్కువగా బెల్టు షాపుల ద్వారానే మద్యం సమకూర్చారు. అయితే పంపిణీ చేయకుండా మిగిలిపోయిన మద్యం ఎన్నికల అనంతరం భారీగా బయటపడింది. కొందరు నాయకులు తమ వద్ద నిల్వ చేసిన మద్యాన్ని బెల్టు దుకాణాలకు తక్కువ ధరకు విక్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సదరు దుకాణాల నిర్వాహకులపై కేసులు కూడా నమోదయ్యాయి. కాగా ప్రస్తుతం కూడా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం దిగుమతి అవుతున్నట్లు తెలుస్తోంది.

బీ ఫారం అంటే ..

యాదగిరిగుట్ట : ఎన్నికల సమయంలో 'ఏ' ఫారం, 'బీ' ఫారం పేర్లు వింటుంటాం. రాజకీయ పార్టీల గుర్తులు అభ్యర్థులకు రావాలంటే ఇవి అవసరం. అవేమిటో, ఎలా ఇస్తారో చూద్దాం.

'ఏ' ఫారం అంటే...

పార్టీ తన అభ్యర్థిగా ఎవరినైతే ఎంపిక చేస్తుందో.. వారికి 'బీ' ఫారం అందిస్తుంది. 'బీ' ఫారం అందించే వ్యక్తికి ముందుగా ఇచ్చేది 'ఏ' ఫారం. ఎవరినైతే పార్టీ ఎంపిక చేసి 'ఏ' ఫారం అందిస్తుందో ఆయనకు మాత్రమే 'బీ' ఫారం ఇచ్చే అవకాశం ఉంటుంది. 'ఏ' ఫారం అందుకున్న అభ్యర్థి ముందుగా తనకు లభించిన 'ఏ' ఫారంను ఎన్నికల అధికారులకు అందజేస్తారు.

'బీ'ఫారం..

గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీలు తమ పార్టీ నుంచి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వీరేనని ఇచ్చేది 'బీ' ఫారం. నామినేషన్ వేసే సమయంలో ఎన్నికల అధికారులకు ఈ ఫారాన్ని దాఖలు చేస్తే పార్టీకి సంబంధించిన ఎన్నికల గుర్తును కేటాయిస్తారు. పార్టీ అధ్యక్షుడు, ప్రత్యేకంగా నియమించిన ప్రతినిధుల ద్వారా ఈ ఫారాన్ని అందిస్తారు.

ఎన్నికలకు ప్రత్యేక యాప్‌లు



చిట్యాల : రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగా సత్వర చర్యలు, అవసరమైన సమాచారాన్ని వెంటనే పొందేందుకుగాను ప్రత్యేక యాప్‌లను రూపొందించింది. ఈ యాప్‌లు ఈ ఎన్నికల్లో ఓటర్లు ఉపయోగించుకునేలా అధికారులు తగిన ప్రచారం చేస్తున్నారు.

సీ-విజిల్ యాప్..

ఎన్నికల్లో అభ్యర్థుల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకుగాను 'సీ-విజిల్'యాప్‌ను రూపొందించారు. ఈ యాప్‌ను మొబైల్స్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న వారు అభ్యర్థుల ప్రవర్తన ఉల్లంఘన నియమావళిపై నేరుగా అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై సీ-విజిల్ యాప్‌లో ఫొటో, వీడియోలతో పాటు ఇతర సమాచారంతో అప్‌లోడ్ చేయాలి. ఆ వెంటనే ఆ సమాచారం డిస్ట్రిక్ట్ కంట్రోలర్‌కు చేరుతుంది. ఐదు నిమిషాల్లోనే ఆ ఫిర్యాదుపై పరిష్కారం కోసం ఫ్లయింగ్ స్క్వాడ్‌కు సమాచారం వెళుతుంది. ఇలా ఫిర్యాదు చేసిన యాభై నుంచి వంద నిమిషాల్లో తీసుకున్న చర్యలను ఫిర్యాదుదారుడికి వెళ్లేలా ఈ యాప్ ద్వారా ఏర్పాటు చేశారు.

సుగమ్య/సక్షం యాప్..

దివ్యాంగ ఓటర్లు, వివిధ ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్లు ఇబ్బందులను తొలగించేందుకుగాను 'సక్షం యాప్' ను రూపొందించారు. ఈ యాప్ ద్వారా దివ్యాంగులు ఓటింగ్ సమయంలో వీల్ చైర్‌తో పాటు అవసరమైన సౌకర్యాలను పొందేందుకు ఉపయోగించుకోవచ్చు. వివిధ ప్రాంతాలనుంచి ఎన్నికల సమయంలో ఓటు వేసేందుకు సొంత ప్రాంతాలకు వచ్చే ఓటర్లు ఇబ్బందులు తొలగించేందుకు, ఓటరు జాబితాలోని తప్పులను సరిదిద్దేందుకు ఈ యాప్‌ను ఉపయోగించుకోవచ్చు.

సుగమ్య పోర్టల్..

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్లు, అఫిడవిట్లు దాఖలుగాను 'సువిధ పోర్టల్' యాప్‌ను ఎన్నికల సంఘం రూపొందించింది. అంతేకాకుండా పోటీ చేసే అభ్యర్థులు నిర్వహించుకునే మీటింగ్‌లు, ర్యాలీలకు ఈ పోర్టల్ ద్వారా అనుమతులను వేగవంతంగా పొందేలా ఈ యాప్‌ను రూపొందించారు.

ఓటర్ హెల్ప్‌లైన్ యాప్..

ఓటర్ల కోసం ప్రత్యేకంగా 'ఓటర్ హెల్ప్‌లైన్' యాప్‌ను రూపొందించారు. అ యాప్ ద్వారా తగిన ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్ ద్వారా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటర్లు లిస్ట్‌లో పేరు, బూత్ వివరాలు, బీఎల్‌ఓ, ఈఆర్‌ఓ వివరాలు, ఎన్నికల ఫలితాలు, ఈవీఎంల సమాచారం , ఓటరు కార్డు డౌన్‌లోడింగ్ వంటి సేవలను ఈ యాప్ ద్వారా పొందవచ్చు.

కేవైసీ యాప్..

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వివరాలను తెలుసుకోవడానికి 'కెవైసీ యాప్' ఉపయోగపడుతుంది. ఈ యాప్ ద్వారా అభ్యర్థుల నేర చరిత్రతో పాటు ఇతర వ్యక్తిగత వివరాలు లభ్యమవుతాయి. ఎన్నికల్లో పోటీ చేసే అన్ని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా తమ అభ్యర్థులకు సంబంధించిన వివరాలను వెబ్‌సైట్‌లో లభ్యమయ్యేలా ఉంచాల్సి ఉంది.

బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి


భువనగిరి రూరల్ : రాబోయే ఎన్నికల్లో న్యాయవాదులు బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాలని రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్, విజయ డెయిరీ కార్పొరేషన్ చైర్మన్ సోమ భరత్ కుమార్ కోరారు. శనివారం భువనగిరిలోని ఓ హోటల్లో భువనగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగారం అంజయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా న్యాయవాదుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో రాజశేఖర్‌రెడ్డి, పైళ్ల లింగారెడ్డి, సిద్ధిరాములు, జయపాల్, డప్పు మల్లయ్య, వీరస్వామి, రావుల రవీందర్‌రెడ్డి, జూకంటి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విప్లవాల గడ్డ..

వీర వనితల అడ్డా

- ఎమ్మెల్యేలుగా ప్రత్యేక గుర్తింపు పొందిన ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం
- ఉమ్మడి జిల్లా నుంచి ఏకైక మహిళా మంత్రిగా ఉమామాధవరెడ్డి
- ఇప్పటికీ మహిళల ప్రాతినిధ్యం అంతంతే..
- 2018 ఎన్నికల్లో గొంగిడి సునీత ఒక్కరే విజయం
- ఎనిమిది నియోజకవర్గాల్లో మహిళా ఓట్లే అధికం
- ఈసారి ఎంతమందికి వచ్చేనో అవకాశం





సాక్షి, నల్లగొండ డెస్క్

భూమి కోసం, భుక్తి కోసం వెట్టి బతుకుల విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో తెగువ చూపిన వీరవనితల అడ్డా నల్లగొండ జిల్లా. నిజాం కాలంలో రజాకార్ల దౌర్జన్యాలను ఎదుర్కోవడంలో పురుషులతో పాటు మహిళలు కూడా ముందునిలిచారు. ప్రజలను వెట్టి చాకిరీ నుంచి విముక్తి చేయడానికి ఆయుధంతో పోరాటం చేసిన మహిళా సారథులను ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారు. తెలంగాణ విముక్తి అనంతరం జరిగిన ఎన్నికల్లో తమ ధీర వనితలను భారీ మెజారిటీతో గెలిపించి చట్టసభలకు పంపించారు.

శాసనసభకు ఎన్నికైన అప్పటి వీరవనితల్లో ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం ప్రముఖులు. ఆరుట్ల కమలాదేవి ఆలేరు నుంచి మూడు సార్లు, మల్లు స్వరాజ్యం తుంగతుర్తి నియోజకవర్గం నుంచి రెండుసార్లు విజయం సాధించారు. ఉమ్మడి జిల్లాలో ఆ తర్వాత కూడా మహిళలు ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా పనిచేసినప్పటికీ ప్రాతినిధ్యం కొంత తక్కువగానే ఉంది. నకిరేకల్ నుంచి మూసపాటి కమలమ్మ ఒకసారి గెలుపొందారు. నల్లగొండ నియోజకవర్గం నుంచి 1985లో జరిగిన ఉప ఎన్నికలో టీడీపీ నుంచి గడ్డం రుద్రమదేవి గెలుపొందారు. ఎలిమినేటి మాధవరెడ్డి, ధీరావత్ రాగ్యానాయక్‌లు నక్సలైట్ల చేతిలో బలైన తర్వాత వారి సతీమణులకు భువనగిరి, దేవరకొండల్లో ఎమ్మెల్యేలుగా అవకాశం వచ్చింది. కోదాడ నుంచి పద్మావతి, ఆలేరు నుంచి గొంగిడి సునీత గెలుపొందారు. ప్రస్తుతం గొంగిడి సునీత ప్రభుత్వ విప్‌గా ఉన్నారు.

ఆలేరులో ఎక్కువ

1952 నుంచి ఆలేరు నియోజకవర్గానికి 15సార్లు సాధారణ ఎన్నికలు, ఒకసారి ఉప ఎన్నిక జరిగింది. ఇందులో మహిళలు ఐదుసార్లు గెలుపొందారు. మూడుసార్లు ఆరుట్ల కమలాదేవి, రెండుసార్లు గొంగిడి సునీత విజయం సాధించారు.

ఐదింటిలో దక్కని ప్రాతినిధ్యం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇప్పటికీ ఐదు నియోజకవర్గాల్లో మహిళలకు ఎమ్మెల్యేలుగా అవకాశం రాలేదు. మునుగోడు, సూర్యాపేట, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం లభించలేదు.

ఒక్కరే మహిళా మంత్రి

భువనగిరి నుంచి తన భర్త మరణానంతరం 2000 సంవత్సరంలో వచ్చిన ఉప ఎన్నికలో గెలుపొందిన ఎలిమినేటి ఉమా మాధవరెడ్డి మంత్రిగా పనిచేశారు. టీడీపీ ప్రభుత్వంలో ఆమె గనులు, భూగర్భజల వనరుల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇప్పటి వరకు మంత్రిగా పనిచేసిన మహిళ ఉమామాధవరెడ్డి ఒక్కరే. అంతకుముందు గానీ, ఆ తర్వాత గానీ మహిళా ఎమ్మెల్యేలకు మంత్రులుగా అవకాశం రాలేదు. 2004, 2009 సాధారణ ఎన్నికల్లోనూ ఉమామాధవరెడ్డి భువనగిరి నుంచి టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత 2014 ఎన్నికల్లో ఆమె ఓడిపోయారు.

మహిళల ఓట్లు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాలు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు
నాగార్జునసాగర్	1,12,613	1,15,947
మిర్యాలగూడ	1,11,169	1,14,434
నల్లగొండ	1,16,487	1,21,326
నకిరేకల్	1,22,021	1,22,442
హుజూర్‌నగర్	1,18,664	1,24,030
కోదాడ	1,16,257	1,21,017
సూర్యాపేట	1,15,628	1,19,576
భువనగిరి	1,05,404	1,05,958

మండలి డిప్యూటీ చైర్‌పర్సన్‌గా భారతి

1999లో దేవరకొండ ఎమ్మెల్యేగా పనిచేసిన రాగ్యానాయక్ నక్సల్స్ దాడుల్లో మరణించారు. ఆ నియోజకవర్గానికి 2002 సంవత్సరంలో జరిగిన ఉప ఎన్నికలో రాగ్యానాయక్ భార్య భారతి కాంగ్రెస్ పార్టీ తరఫున ఏకగ్రీవంగా శాసనసభకు ఎన్నికయ్యారు. ఆమె రెండు సంవత్సరాలే ఎమ్మెల్యేగా ఉన్నారు. 2004లో జరిగిన సాధారణ ఎన్నికల్లో పొత్తులో భాగంగా దేవరకొండ సీటు సీపీఐకి కేటాయించారు. దీంతో భారతీరాగ్యానాయక్‌కు ఎమ్మెల్సీగా అవకాశం వచ్చింది. ఆమె శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్‌గా కూడా పనిచేశారు.

మహిళలు గెలుపొందిన నియోజకవర్గాలు ఇవే..

సంవత్సరం	అభ్యర్థి	పార్టీ
	ఆలేరు	
1952	ఆరుట్ల కమలాదేవి	పీడీఎఫ్
1957	ఆరుట్ల కమలాదేవి	పీడీఎఫ్
1962	ఆరుట్ల కమలాదేవి	సీపీఐ
2014	గొంగిడి సునీత	టీఆర్‌ఎస్
2019	గొంగిడి సునీత	టీఆర్‌ఎస్
	తుంగతుర్తి	
1978	మల్లు స్వరాజ్యం	సీపీఎం
1983	మల్లు స్వరాజ్యం	సీపీఎం
	భువనగిరి	
2000(ఉఎ)	ఉమామాధవరెడ్డి	టీడీపీ
2004	ఉమామాధవరెడ్డి	టీడీపీ
2009	ఉమామాధవరెడ్డి	టీడీపీ
	కోదాడ	
2014	పద్మావతి	కాంగ్రెస్
	నల్లగొండ	
1985	రుద్రమదేవి	టీడీపీ
	నకిరేకల్	
1972	కమలమ్మ	కాంగ్రెస్
	దేవరకొండ	
2002(ఉ.ఎ)	భారతీరాగ్యానాయక్	కాంగ్రెస్

ఎలక్షన్ ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ప్రారంభం



కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న సూర్యాపేట కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సూర్యాపేట కలెక్టరేట్‌లో ఎలక్షన్ ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్, ఎన్నికల అధికారి ఎస్. వెంకట్రావ్.. జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఐటీకి సంబంధించిన యాప్‌లను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కేంద్రం వారంలో 24 గంటలు సర్వీస్ అందిస్తుందని, ఎన్నికల సందర్భంగా ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే 1950 ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. సీ-విజిల్, ఎంజీఆర్‌ఎస్ సమస్యల పరిష్కారం, ఎన్‌కోర్ అనుమతులు మొదలగు వాటి గురించి ఈ కేంద్రం పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌ఓ శ్రీధర్ గౌడ్, కలెక్టరేట్ ఏఓ సుదర్శన్‌రెడ్డి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

ఆత్మకూర్ (ఎస్) : సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆత్మకూర్ మండల కేంద్రంలో మండల కేంద్రంతో పాటు కోటపహాడ్, నశింపేట గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. కాళేశ్వరంతో రాష్ట్రం, సూర్యాపేట నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందన్నారు. మరోమారు సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదిస్తే రాష్ట్రం, సూర్యాపేట అభివృద్ధిలో మరింత ముందుకెళ్తుందన్నారు. అభివృద్ధిని చూసి కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, ఎంపీపీ మర్ల చంద్రారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు తుడి నరసింహారావు, ప్రధాన కార్యదర్శి బత్తుల ప్రసాద్, సర్పంచ్ వీరారెడ్డి, మాజీ ఎంపీపీ బ్రహ్మంగౌడ్, కృష్ణారెడ్డి, జానయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న జోనల్ స్థాయి క్రీడా పోటీలు



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

భువనగిరి: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల 9వ జోనల్ స్థాయి క్రీడా పోటీలను శనివారం రెండో రోజు యాదాద్రి రీజినల్ కోఆర్డినేటర్ రజిని, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాం శ్రీనివాస్ పర్యవేక్షించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

రెండో రోజు అథ్లెటిక్స్‌లో విజేతలు..

అండర్-14 కేటగిరీలో 200 మీటర్ల పరుగు పందెంలో ప్రవీణ్(హుజూర్‌నగర్) ప్రథమ, ఎం. మహేష్(ఘనపూర్) ద్వితీయ, జి. విశాల్(చివ్వెంల) తృతీయ స్థానం సాధించారు. 600 మీటర్ల పరుగు పందెంలో కె. ప్రవీణ్(హుజూర్‌నగర్) ప్రథమ, కె. సిద్దార్థ(మిర్యాలగూడ) ద్వితీయ, మహబూబ్(రాజా పేట) తృతీయ స్థానం పొందారు. షాట్‌పుట్‌లో ఎం. దత్తు(తిప్పర్తి) ప్రథమ, ప్రణీత్‌కుమార్(చివ్వెంల) ద్వితీయ, కె. భరత్ (మిర్యాలగూడ) తృతీయ స్థానం సాధించారు. డిస్కస్ త్రోలో కె. అరవింద్(ఘనపూర్) ప్రథమ, ఎం. సాయికిరణ్ (మోత్కూరు) ద్వితీయ, ఎం. గణేష్ (మోత్కూరు) తృతీయ స్థానంలో నిలిచారు. లాంగ్‌జంప్‌లో కె. ప్రవీణ్(హుజూర్‌నగర్) ప్రథమ, కె. సిద్దార్థ(మిర్యాలగూడ) ద్వితీయ, ఎం. హర్షవర్ధన్(తిప్పర్తి) తృతీయ స్థానం సాధించారు.

బుద్ధుడి బోధనలతోనే అసమానతలు దూరం



బుద్ధుడి పాదాల చెంత పుష్పాంజలి ఘటిస్తున్న లోకమిత్ర, మల్లెపల్లి లక్ష్మయ్య, బౌద్ధులు



మహాస్తూపం ముందు దక్కన్ కళాశాల విద్యార్థులు

నాగార్జునసాగర్: సమాజంలోని అసమానతలను రూపుమాపేందుకు బుద్ధుని బోధనలే శరణ్యమని నాగపూర్‌లోని నాగలోక బుద్ధవిహార్‌లో గల నాగార్జున ఇనిస్టిట్యూట్ అధ్యక్షుడు లోకమిత్ర అన్నారు. శనివారం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో ధమ్మదీక్ష దివస్ కార్యక్రమాన్ని ప్రాజెక్టు ప్రత్యేకాధికారి మల్లెపల్లి లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంతకుముందు హైదరాబాద్ మహాబోధి సొసైటీకి చెందిన సంఘపాలభంతే ఆధ్వర్యంలో బుద్ధుడి పాదాల చెంత పుష్పాంజలి ఘటించారు. బౌద్ధులు ప్రార్థనలు చేశారు. అనంతరం మహాస్తూపం అంతర్భాగంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన దమ్మదీక్ష దివస్ కార్యక్రమానికి లోకమిత్ర ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ అంబేడ్కర్ ఆరు లక్షల మందితో బౌద్ధమతాన్ని స్వీకరించి ప్రపంచవ్యాప్తంగా సమసమాజాన్ని స్థాపించేందుకు కృషి చేశారని అన్నారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి లింబాద్రి మాట్లాడుతూ.. బుద్ధుడి బోధనలు, అంబేడ్కర్ రచనలు యువతరానికి మార్గదర్శకాలని అన్నారు. సంఘపాల భంతే మాట్లాడుతూ.. ధమ్మదీక్ష దినోత్సవం గురించి వివరించారు. మల్లెపల్లి లక్ష్మ య్య మాట్లాడుతూ.. బుద్ధుని బోధనలే ప్రపంచానికి మార్గనిర్దేశాన్ని చూపుతాయని అంబేడ్కర్ భావించారని తెలిపారు. కార్యక్రమంలో బుద్ధవనం ఓఎస్‌డీ సుధాన్‌రెడ్డి, బౌద్ధ విషయ నిపుణుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, బుద్ధవనం డిజైన్ ఇన్‌చార్జి శ్యాంసుందర్, శ్రీధర్, గోనారెడ్డి, బెల్లి యాదయ్య పాల్గొన్నారు.

బుద్ధవనం సందర్శించిన 'దక్కన్' విద్యార్థులు

బుద్ధవనాన్ని మహారాష్ట్రలోని పూణెలో గల దక్కన్ కాలేజీలో ఎంఏ పురావస్తు శాస్త్రం చదువుతున్న 40మంది విద్యార్థులు సందర్శించారు. బౌద్ధ క్షేత్రాల అధ్యయనంలో భాగంగా ఇక్కడి వచ్చినట్లు వారు తెలిపారు. పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి విద్యార్థులకు బుద్ధవనం, బుద్ధుని జీవిత జాతక కథలు, బుద్ధచిహ్నాలు, వాస్తువిశేషాలను వివరించారు. మహాస్తూపంపై గల శిల్పాలు చూడముచ్చటగా ఉన్నాయని విద్యార్థులు పేర్కొన్నారు.

దొంగ అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

బొమ్మలరామారం: చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మలరామారం మండలం రామలింగంపల్లి గ్రామ సమీపంలోనిశ్రీరామలింగేశ్వర ఫంక్షన్‌హాల్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న అప్పారావు గదిలో ఈ నెల 8వ తేదీ రూ.10వేల నగదు, అర తులం బంగారం, సెల్‌ఫోన్, గ్యాస్ సిలిండర్ చోరీకి గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా షామీర్‌పేట్ మండలానికి చెందిన మడిగెల బాలచందర్ చోరీకి పాల్పడినట్లు గుర్తించినట్లు ఎస్‌ఐ తెలిపారు. సికింద్రాబాద్‌లోని లోతుకుంటలో నివాసముంటున్న అతడిని శనివారం అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట కానిస్టేబుల్ జనార్దన్, రాజు, సతీష్ ఉన్నారు.

పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం

పెద్దవూర: మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి శనివారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలు.. చింతపల్లి గ్రామానికి చెందిన కంచర్ల కోటేష్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన కోటేష్ మధ్యాహ్నం సమయంలో తాను పురుగుల మందు తాగానని, ఈ రోజే తనకు చివరి రోజని తన స్నేహితునికి ఫోన్ చేసి స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో ఆందోళనకు గురైన స్నేహితుడు విషయాన్ని కోటేష్ భార్యకు తెలిపి పొలం వద్దకు వెళ్లి చూడగా అప్పటికే కోటేష్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే చికిత్స నిమిత్తం అతడిని నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. కోటేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం నల్లగొండకు తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

వ్యాపారిపై కత్తితో దాడి.. ఇద్దరు యువకులపై కేసు

సూర్యాపేట క్రైం: వ్యాపారిపై కత్తితో దాడి చేసి గాయపర్చిన ఇద్దరు యువకులపై ససూర్యాపేట పట్టణ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని కృష్ణానగర్ కాలనీకి చెందిన డ్రైఫ్రూట్స్ వ్యాపారి మణికంఠ ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. శుక్రవారం రాత్రి మణికంఠ ఆ యువతితో కలిసి తన బైక్‌పై వెళ్తుండగా ఆమె సోదరి ప్రియుడైన విల్సన్ తన స్నేహితుడు నెమ్మాది బిట్టుతో కలిసి వారిని అడ్డగించాడు. విల్సన్, నెమ్మాది బిట్టు కలిసి మణికంఠపై కత్తితో దాడి చేశారు. మణికంఠ సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మణికంఠ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాకూబ్ తెలిపారు.

మట్టపల్లిలో వైభవంగా పవిత్రారోపణం



గర్భాలయం నుంచి పవిత్రాలు తీసుకొస్తున్న ఆలయ అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లిలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలలో భాగంగా శనివారం పవిత్రారోపణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాజ్ఞీకులు బొర్రా వెంకటవాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో దేవోత్థాపన, ఆరాధన, అష్టోత్తర శతకలశస్నపనతో పవిత్రాలను ఆరోపణగావించారు. అదేవిధంగా ప్రధాన హోమం, బలిహరణ, మూలమంత్ర హోమం, సర్వభేరణాం పవిత్రారోపనం చేపట్టారు. సాయంత్రం స్వామివారికి ప్రత్యేక ఉత్సవం, మహాశాంతి హోమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పవిత్రోత్సవాలలో చివరి రోజైన ఆదివారం స్వామి, అమ్మవార్లకు మహాశాంతి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య



మహేష్ (ఫైల్)

తుంగతుర్తి: ఇంట్లో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తుంగతుర్తి మండలంలోని వెంపటి గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంపటి గ్రామానికి చెందిన ఎనగందుల మహేష్(30)కు భార్య ప్రశాంతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎంగిలి పువ్వు బతుకమ్మ సందర్భంగా శనివారం మహేష్ తన భార్య ప్రశాంతిని గ్రామంలో బతుకమ్మ వేడుకల వద్దకు తీసుకెళ్లాడు. అనంతరం ఒక్కడే ఇంటికి వచ్చి తాడుతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహేష్ చిన్న కుమారుడు గమనించి వెంటనే వెళ్లి తల్లికి విషయం చెప్పి ఇంటికి తీసుకొచ్చాడు. భార్య ప్రశాంతి ఇంటికి చేరుకొని కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి మహేష్‌ను తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని డాక్టర్లు నిర్ధారించారు. మహేష్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.